ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.8 కనిష్ఠం 20.6



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

శనివారం 2 మార్చి 2024

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

తలమడుగు, మార్చి1: ఈనెల 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 5ఏళ్ల పిల్లలందరికీ తప్పకుండా చుక్కల మందు వేయించాలన్నారు. మొదటిరోజు వేయించిన పిల్లలకు రెండోరోజు ఇంటింటికీ తిరిగి వేయించాలని సూచించారు. అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, వైద్యసిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఇందులో ఎంపీడీవో శేఖర్, మండల వైద్యాధికారి డాక్టర్ హరీష్, తదితరులు పాల్గొన్నారు.





● సిరికొండ సెక్షన్ పరిధిలోని సాత్‌మోరి, పాలవాగు, కుంటగూడ బీట్ పరిధిలో నరికిన టేకు వృక్షాలు

- కవ్వాల్ అడవులను అడ్డంగా నరికేస్తున్న స్మగ్లర్లు
- చెక్‌పోస్టుల వద్ద నామమాత్రంగానే తనిఖీలు
- జిల్లా అధికారులు మారినా ఆగని కలప అక్రమ రవాణా
- క్షేత్రస్థాయిలో నిఘా కరువు
- మైదానాలుగా మారుతున్న దట్టమైన అడవులు

కవ్వాల్‌లో.. గొడ్డలి చప్పుళ్లు!

ఆదిలాబాద్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కలప స్మగ్లర్ల ఆగడాలకు అడ్డూ అదుపే లేకుండా పోవడంతో అడవులకు రక్షణే లేకుండా పోయింది. దట్టమైన అడవులకు నిలయమైన కవ్వాల్ అభయారణ్యం అడవుల్లో నిత్యం గొడ్డలి చప్పుళ్ల మోత విన్పిస్తోంది. స్మగ్లర్ల పేటుకు మైదాన ప్రాంతాలుగా మారిపోతున్నాయి. అక్రమ కలప రవాణాకు స్మగ్లర్లు ఎంతకైనా తెగిస్తున్నారు. గతంలో ముల్తానీలపై కఠినంగా వ్యవహరించి ఇప్పటికే ఒకరిద్దరిపై పీడీ యాక్టు కేసులను కూడా నమోదుచేశారు. అయినా జిల్లాలో కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడంలేదు. కవ్వాల్ అభయారణ్యం సంరక్షణకు ప్రత్యేక అధికారిని నియమించిన ప్రయోజనమే లేకుండాపోయింది. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎంతో విలువైన కలప ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది. తాజాగా సిరికొండ మండలం పాలవాగు, కుంటగూడ బీట్ పరిధిలో పదుల సంఖ్యలో టేకు వృక్షాలను నరికి స్మగ్లర్లు తరలించుకు పోవడంతో అటవీశాఖ అధికారుల పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

● జిల్లాలో కవ్వాల్ అభయారణ్యం

జిల్లాలో సిరికొండ, ఇంద్రవెల్లి, ఉట్నూర్, ఇచ్చోడ మండలాల పరిధిలో కవ్వాల్ అభయారణ్యం అడవులు విస్తరించి ఉన్నాయి. సుమారుగా 40వేల హెక్టార్లలో కవ్వాల్ టైగర్‌జోన్ (కేటీఆర్) అటవీ ప్రాంతం ఉంది. కానీ యేటేటా జిల్లా అడవుల విస్తీర్ణం భారీగా తగ్గిపోవడం ఆందోళన రేపుతోంది. అడవుల సంరక్షణకు బేస్ క్యాంపులు, చెక్‌పోస్టులు, చుట్టూ కందకాలు, ముళ్లకంచెను ఏర్పాటు చేసిన అడ్డదారుల్లో అక్రమ రవాణా సాగుతూనే ఉంది. దీనికి తోడు అధికారుల నిండు నిర్లక్ష్యం స్మగ్లర్లకు మరింత కలిసి వస్తోంది. ఎంతమంది జిల్లా అధికారులను మారినా పరిస్థితుల్లో మాత్రం మార్పు కనిపించడం లేదంటున్నారు. కలప అక్రమ రవాణాకు ఇకనైనా అడ్డుకట్ట వేయకపోతే కవ్వాల్ అభయారణ్యం కొన్నేళ్లలోనే మైదానప్రాంతంగా మారిపోయే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● రెచ్చిపోతున్న స్మగ్లర్లు

కొంతమంది అధికారుల పరోక్ష సహకారంతోనే కలపస్మగ్లర్లు మరిం తగా రెచ్చిపోతున్నారన్న వాదనలు విన్పిస్తున్నాయి. క్షేత్రస్థాయి అధికా రులతోపాటు చెక్‌పోస్టు, కిందిస్థాయి సిబ్బందికి ముందే సమాచారం అందిస్తూ తమ అక్రమదందాకు అడ్డూ అదుపు లేకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. అసలు చెక్‌పోస్టుల వద్ద అధికారుల నిఘా కొరవడడంతో కిందిస్థాయి సిబ్బందే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. రాత్రివేళల్లో కొంతమంది బీట్ అధికారులు చెక్‌పోస్టు విధులకు దుమ్మా కొడుతూ ప్రైవేట్ సిబ్బందితోనే విధులను నెట్టుకొస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో చెక్‌పోస్టు సిబ్బందితో చేతులు కలుపుతున్న స్మగ్లర్లు అదును చూసి కలపను తరలించుకు పోతున్నట్లు తెలుస్తోంది. 'దొరికితే దొంగ లేకపోతే దొర' అన్నచందంగా కవ్వాల్ అభయారణ్యంలో అక్రమ కలప దందా సాగుతోంది. అడపదడపగా తనిఖీలు చేయడం దొరికిన కలపను పట్టుకోవడం, కేసులు నమోదు చేస్తూ స్మగ్లర్లను వదిలేయడం అధికారులకు అలవాటుగానే మారింది. అయితే ఎన్ని కట్టడి చర్యలు చేపట్టిన కవ్వాల్ అభయారణ్యంలో అక్రమ కలపదందాకు అడ్డుకట్ట పడకపోవడం ఏమిటి అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

● చేతులెత్తేస్తున్న అధికారులు

కవ్వాల్ అభయారణ్య అడవులకు రక్షణ కల్పించడంలో అధికారులు చేతులెత్తేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు సక్రమంగా విధులు నిర్వహిస్తే అడవులు ఎలా మైదాన ప్రాంతాలుగా మారి పోతున్నాయో వారికే తెలియాలిమరి. అధికారులు రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్నా కలప అక్రమరవాణాకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. ఎంతో అనుభవం కలిగిన ఉన్నతాధికారులను నియమించిన కలప అక్రమ రవాణాను ఆపలేకపోతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే కొంతమంది కాసులకు కక్కుర్తిపడి స్మగ్లర్లకు పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అడపదడపగా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నా శాశ్వత పరిష్కార మార్గాన్ని చూపలేక పోతున్నారు. కవ్వాల్ అభయారణ్యంలో నిషేధాజ్ఞలు ఉన్నా అవి ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదంటున్నారు. యధేచ్ఛగా కలప, ఇసుక, మొరం తరలిపోతూనే ఉంది. అడ్డుకట్ట వేసేందుకు ఎన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్న అడ్డదారుల్లో స్మగ్లర్లు కలపను తరలించుకుపోతున్నారు. ఇప్పటివరకు కవ్వాల్ అభయారణ్యం పరిధిలో ఎంతోమంది అధికారులు, సిబ్బందిపై బదిలీ వేటు వేసినా పరిస్థి తుల్లో మార్పు కనిపించడం లేదు. అసలు లోపం ఎక్కడ ఉందో అంతుచిక్కడం లేదంటున్నారు. ఇవే పరిస్థితులు మరికొంతకాలం పాటు కొనసాగితే అసలు అభయారణ్యం అడవులు కనిపించకుండా పోయే ప్రమాదం ఉందంటున్నారు. అధికారులు చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా పనిచేస్తేనే కొంత మేరకైనా అడవులను రక్షించుకునే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



● ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ (అటవీశాఖ జిల్లా అధికారి)

కవ్వాల్ అభయారణ్యంలో టేకు వృక్షాల నరికి వేతపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో మరింత నిఘాను సారిస్తాం. అక్రమ కలప, ఇసుక, మొరం రవాణాకు అడ్డుకట్ట వేస్తాం. అక్రమ కలప రవాణాకు పాల్పడిన స్మగ్లర్లపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటాం. కవ్వాల్ అభయారణ్యం అడవులను రక్షించేందుకు అన్నిరకాల జాగ్రత్తలను తీసుకుంటున్నాం.

వివేకానంద జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



విద్యార్థులకు మెమోంటో అందిస్తున్న ఎమ్మెల్యే

● ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి1: యువత వివేకానంద జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకుని శ్రీరామకృష్ణ సేవాసమితి నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన విజేతలకు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మహాలక్ష్మివాడలో ఎమ్మెల్యే పాయలశంకర్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు పారిశ్రామిక వేత్త భజరంగ్‌లాల్ అగర్వాల్‌లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో జీవనాన్ని కొనసాగించే వారికి ఎప్పుడు విజయాలు వరిస్తాయన్నారు. తనకు స్వామి వివేకానందనే స్ఫూర్తి ప్రదాతని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మూడుసార్లు ఓడినా ధైర్యాన్ని కోల్పోకుండా నాలుగోసారి పోటీచేసి విజయాన్ని సాధించానని అన్నారు. ఈ పోటీ పరీక్షల్లో గెలిచిన వారికి, గెలవని వారికి అందరికీ స్వామివివేకానంద స్ఫూర్తిగా కావాలన్నారు. భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్‌లు ఆర్మీఆఫీసర్లు కూడా అయ్యే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి లెనిన్, స్థానిక బీజేపీ నాయకులు ధనరాజ్, కేశవ్ మహేందర్, ముకుంద్, విజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రాథోడ్ రమేష్

'మోదీ సభను విజయవంతం చేయాలి'

ఇద్రవెల్లి / ఉట్నూర్, మార్చి 1: ఈనెల 4న ఆదిలాబాద్‌లో జరిగే ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ నేత, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఆరేల్లీ రాజలింగు అ ధ్యక్షతన జరిగిన మండల స్థాయి ముఖ్య నాయకులు, బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జిలతో ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రధానిమోదీ సభను విజయవంతం చేయడానికి శక్తి కేంద్ర ఇన్‌చార్జిలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యనిర్వాహక సభ్యులు, జైస్వాల్ శివకుమార్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరపరాజు, నాయకులు దేవపూజ్ మారుతి, ఆడావ్ చంపత్‌రావు, రాథోడ్ భీం రావ్, మోరే దిలిప్, మాస్కే రాజవ ర్ధన్ తదితరులు పాల్గొన్నారు. అలా గే రాథోడ్‌జనార్ధన్, మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్‌లు మహాగావ్ శేకుగూడ లో బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలో సన్నాహక స మావేశమై సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు.

సంక్షిప్త సమాచారం

శనగ కొనుగోళ్లు ప్రారంభించాలి

తాంసి, మార్చి1: ఒకటి, రెండురోజుల్లో శనగ కొనుగోళ్లను ప్రారంభించాలని మండల రైతులు కోరుతున్నారు. ఈ పాటికే ఆయా గ్రామాల్లోని రైతులు తమ పంటను ఇంటికి తీసుకొచ్చారని, కానీ ఇంకా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో తమకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు అంటున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పలువురు రైతులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకా కొనుగోలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఎలాంటి పారదర్శకత లేకుండా ప్రతీ రైతు శనగలను కొనుగోలు చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు రవీందర్, భూమన్న, కిష్టన్న నారాయణరెడ్డి ఉన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్, మార్చి1: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆదర్శ క్రీడా పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశం కోసం అర్హులైన గిరిజనులు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరం కోసం ఉట్నూర్‌లోని ఆదర్శక్రీడా పాఠశాలలో 40 సీట్లు, బజార్‌హత్నూర్ మండలం జాతర ఆదర్శ క్రీడా పాఠశాలలో బాలుర కోసం 40 సీట్లు, ఆసిఫాబాద్‌లోని క్రీడా పాఠశాలలో 40సీట్లు, హైదరాబాద్ బోయినపల్లి స్పోర్ట్స్ అకాడమిలో 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ఈనెల 12న ఉట్నూర్‌లోని కొమురంభీం క్రీడా మైదానంలో నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థుల ఎత్తు, బరువు, స్టాండ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్‌త్రో, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, పెక్సిబిలిటి టెస్టు, 60మీటర్ల షటిల్ రన్, 800 మీటర్ల పరుగు పందెం అంశాల్లోపోటీలు నిర్వహించి ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న గిరిజన బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. 4, 5, 6, 7 తరగతులు చదువుతున్నవారు సెప్టెంబరు 2015 వరకు జన్మించినవారు ఎలిజిబిలిటీఫారం, రెండు ఫొటోలు, ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకుంటే అర్హులైన వారికి ఖాళీఉన్న సీట్లలో భర్తీ చేస్తామని వెల్లడించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

బోథ్, మార్చి1: మండల కేంద్రంలోని ఆరో వార్డులో శుక్రవారం ఎంపీపీ తుల శ్రీనివాస్ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.8లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా మండల కేంద్రంలో ఆరో వార్డులో సరైన రోడ్డు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారని ఈ విషయం తమ దృష్టికి రావడంతో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ నిధులు మంజూరు కాగా పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్, డైరెక్టర్ ఉమేష్, శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ప్రశాంత్ ఎంపీటీసీలు ఉన్నారు.

పేదిళ్లలో మెరిసిన విద్యాకుసుమాలు

● ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు ఎంపికైన బోయినపల్లి జ్యోతి

బోథ్, మార్చి1: పేదిళ్లలో విద్యాకుసుమాలు మెరిశాయి. మండలంలోని సోనాల గ్రామానికి చెందిన బోయినపల్లి జ్యోతి ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు ఎంపికైంది. రాములు, లక్ష్మి దంపతుల మూడో కూతురు బొయినపల్లి జ్యోతి గురుకుల ఫలితాల్లో నాలుగు ఉద్యోగాలకు ఎంపికై సత్తాచాటింది. టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్ నాలుగు ఉద్యోగాలకు ఎంపికై సరస్వతి పుత్రికగా గ్రామస్థుల చేత అందరి మన్ననలు పొందుతోంది.





● కూలీ కుటుంబంలో ఆణిముత్యం

తాంసి: కూలీ కుటుంబంలో ఓ విద్య కుసుమం వికసించింది. రెక్కలు ముక్కలుచేస్తే గానీ పూట గడవని ఆ కుటుంబంలో ఓ విద్యావంతుడు ఉన్నత ఉద్యోగాన్ని సాధించాడు. తాంసి మండల కేంద్రానికి చెందిన బెల్లపు తానుబాయి, దేవిదాసుల కుమారుడు నగేష్. తానుబాయి, దేవిదాసు కూలీ పనులు చేస్తూ నగేష్‌ను చదివించారు. అయితే శుక్రవారం వెలవడ్డ గురుకుల డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రంలో 5వ ర్యాంకు సాధించాడు. అలాగే గురుకుల జూనియ ర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రంలో మూడో ర్యాంకు సాధించాడు.

ఎస్జీటీ పోస్టులను తక్కువ చూపించారని ధర్నా

● డీఈవోకు వ్యతిరేకంగా నినాదాలు

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి1: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో ఆదిలాబాద్ జిల్లాలో ఎస్జీటీ పోస్టులను స్థానిక డీఈవో తక్కువ చూపించారంటూ బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు శుక్రవారం విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డీఈవోకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత డీఎస్సీలో 145 పోస్టులను చూపించారని, ఈ డీఎస్సీలో కేవలం మూడు పెంచి 148 చూపించారని పేర్కొన్నారు. డీఈవో నిర్లక్ష్యంగానే ఎస్జీటీ పోస్టులు తక్కువగా చూపించారని ఆరోపించారు. ఈ విషయమై డీఈఓను కలిస్తే మళ్లీ దాన్ని సవరించి పంపిస్తామని చెబుతున్నారన్నారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎలా సరి చేస్తారని ప్రశ్నించారు. తమకు న్యాయం కోరారు. కార్యక్రమంలో అభ్యర్థులు రంజిత్, ప్రవీణ్, వైష్ణవ్, రవికిరణ్, రాజ్‌కుమార్, కిరణ్, ప్రమోద్, శివ పాల్గొన్నారు.

హామీలపై ప్రధాని స్పష్టత ఇవ్వాలి

● జిల్లా అభివృద్ధి సాధన పోరాట కమిటీ కన్వీనర్ బండి దత్తాత్రి



సమావేశంలో మాట్లాడుతున్న బండి దత్తాత్రి

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి1: బీజేపీ గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు సీసీఐ పునరుద్ధరణ, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్, ఆదిలాబాద్ ఎరోడ్రమ్, గిరిజన యూనివర్సిటీ, టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుపై ప్రధాన మంత్రి సభలో మాట్లాడి జిల్లా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి సాధన పోరాట కమిటీ కన్వీనర్ బండిదత్తాత్రి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని సుందరయ్య భవనంలో సాధన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి అనేక హామీలిచ్చి గెలిచాక విస్మరించిందని విమర్శించారు. ప్రధాని జిల్లా అభివృద్ధికి ఏం చేశారో తెలుపాలని, గతంలో ఇచ్చిన హామీల అమలుకు ఏం కార్యచరణ ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కో కన్వీనర్ ముడుపు ప్రభాకర్‌రెడ్డి, గణపతిరెడ్డి, దర్శనాల మల్లేష్, రోకండ్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ముళ్ల పొదలను తొలగించి పనులు చేపడుతున్న దృశ్యం



పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

ముమ్మరంగా సాగుతున్న ప్రధాని పర్యటన ఏర్పాట్లు

● ఎరోడ్రమ్‌లో హెలిప్యాడ్ ఏర్పాటు ● ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బహిరంగ సభ

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి1: ఈనెల 4న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జిల్లా పర్యటన సందర్భంగా అధికారులు, బీజేపీ నేతలు ముమ్మర ఏర్పాట్లను చేస్తున్నారు. ఎరోడ్రమ్ మైదానంలో హెలిప్యాడ్ నిర్మాణ పనులతో పాటు మైదానాన్ని చదును చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అక్కడ ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించారు. అలాగే ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సభ ఏర్పాట్లను చేస్తున్నారు. ఎరోడ్రమ్ నుంచి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న దుకాణాలను తొలగిస్తున్నారు. అలాగే ఎరోడ్రమ్ పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నారు. మోదీ పర్యటనకు మరో రెండు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉండడంతో వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాని ఇప్పటి వరకు మోదీ పర్యటన పై అధికారిక సమాచారం అందలేదని అధికారులు చెబుతున్నారు.

ఉట్నూర్ పాలిటెక్నిక్‌ను అప్‌గ్రేడ్ చేయాలి



ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌కు వినతి పత్రం ఇస్తున్న అక్షయ్‌కుమార్

ఉట్నూర్, మార్చి1: మండలంలోని లాల్‌టేకిడి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళా శాలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మబొజ్జును తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మేకల అక్షయ్‌కుమార్ కలిసి విజ్ఞప్తి చేశారు. కళాశాలలో ప్రస్తుతం ఉన్న మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులతోపాటు కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ వంటి ఆధునాతన కోర్సులను ప్రవేశపెడుతూ ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషిచేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్రనాయకుడు శ్యామ్ ఉన్నారు.

7 నుంచి వడ్డాడి నరసింహ స్వామి జాతర

తాంసి, మార్చి1: మండలంలోని వడ్డాడి గ్రామంలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు లక్ష్మీనరసింహస్వామి జాతరను నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ జాతరను ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు.

'ప్రజల కోసమే శాశ్వత ఆధార్ సెంటర్ ఏర్పాటు'

ఇంద్రవెల్లి, మార్చి1: ప్రజల అవసరాలను పరిగణలోనికి తీసుకుని శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాన్ని పునఃప్రారంభించినట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఆధార్ కేంద్రాన్ని పునఃప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మెస్రం లక్ష్మణ్ రావు తదితరులున్నారు.

అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరేలా కృషి చేయాలి

● యుద్ధ ప్రాతిపదికన ప్రజాసేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలి ● వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి1:వివిధ వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం కింద అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతీ ఒక్కరికి లబ్ధి చేకూరేలా కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ద్వారా అర్హత కలిగిన వారందరు ప్రయోజనం పొందేలా అన్ని ఎంపీడీఓ కార్యాలయాలు, మున్సిపల్ వార్డు ఆఫీసులలో సత్వరమే ప్రజా పాలన సేవా కేంద్రాలను నెలకొల్పాలని ఆదేశించారు. రాష్ట్ర డీజీపీ రవి గుప్తాతో కలిసి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా దరఖాస్తులు చేసుకోలేక పోయిన అర్హులైన వారితో పాటు, దరఖాస్తులలో సరైన వివరాలు నమోదు చేయని వారి కోసం ప్రజాపాలన సేవ కేంద్రాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా ఏర్పాటైన పలు మండలాలల్లో ఎంపీడీఓ కార్యాలయాలు లేనందున, అలాంటి చోట తహసీల్దార్ ఆఫీసులలో ప్రజాపాలన సేవా కేంద్రాలను అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కేంద్రాలు శాశ్వత ప్రాతిపదికన పని చేసే అవకాశాలు ఉన్నందున, ఇంటర్నెట్ సదుపాయంతో కూడిన కంప్యూటర్ ఏర్పాటు చేస్తూ, డేటాఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలన్నారు. వచ్చే సోమవారం అన్ని చోట్ల సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చి పని తీరు ప్రారంభం కావాలని సూచించారు. కార్యాలయాల పని దినాలలో ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు సేవ కేంద్రాలు తెరిచి ఉంచాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోలేక పోయిన వారి కోసం కొత్తగా దరఖాస్తులు చేసుకునేందుకు వీలుగా అభయహస్తం దరఖాస్తు ఫారాలను ప్రజాపాలన సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచాలన్నారు. అదే విధంగా సరైనరీతిలో వివరాలను పొందుపర్చలేక పోయిన దరఖాస్తుదారుల వివరాలను సరి చేస్తూ ఆన్‌లైన్‌లో ఆప్‌డేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. ముఖ్యంగా వంట గ్యాస్ ఏజెన్సీ పేరు, వినియోగదారుడి నెంబరు, రేషన్‌కార్డు వివరాలు, మొబైల్ నెంబర్ తదితర వాటిని సరిచేస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు

పదవ తరగతి, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ప్రస్తుతం కొనసాగుతున్న ఇంటర్మీడియట్‌తో పాటు త్వరలో ప్రారంభం కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి సూచించారు. ఏ చిన్న తప్పిదాలు, అవాంఛనీయ ఘటనలకు సైతం తావులేకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను పరీక్ష కేంద్రాలలోకి సెల్‌ఫోన్లను అనుమతించకూడదని, కాపీయింగ్‌కు అస్కారం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యానికి, అక్రమాలకు అస్కారం కల్పించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ తీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పరీక్షలు ముగిసేంత వరకు జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, కాపీయింగ్ జరిగేందుకు అవకాశం ఉన్న సెంటర్ల వద్ద అదనపు సిబ్బందిని నియమించాలని పోలీసు కమిషనర్లు, ఎస్పీలకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ గౌస్‌ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, జిల్లా విద్యా శాఖ అధికారి ప్రణీత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అఖండ హరినామ సప్తాహ పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

నేటి నుంచి అఖండ హరినామ సప్తాహం ప్రారంభం

ముథోల్, మార్చి 1 : మండల కేంద్రమైన ముథోల్‌లోని పశుపతినాథ్ శివాలయంలో శనివారం అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శనివారం నుంచి 9వ తేదీ శనివారం వరకు ఈ భక్తి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఇట్టి కార్యక్రమం గ్రామసంఘం, భజన భక్తుల ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత పోస్టర్లు గ్రామ సంఘం, భజన భక్తులు కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తాలూకా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు రోళ్ల రమేష్, గ్రామ సంఘం అధ్యక్షులు గుంజల నారాయణ, కోశాధికారి మేత్రి సాయినాథ్, కార్యదర్శి కే.నారాయణ, ఉపాధ్యక్షులు ఆనంద్ పటేల్, కార్యవర్గ సభ్యులు ఎస్. సాయిలు, ఎం. మధు, ఐటీ సాయినాథ్, కప్పటి పోతన్న పటేల్, పి. నాగేష్, గంగన్న, మహదు, కెర్బ, లక్ష్మణ్, దశరథ్, ప్రభాకర్, లక్ష్మణ్ పటేల్, మాదవ్, మాధవ్, బి. గంగాధర్, డి. గంగాధర్, పండరి, కే. రవి, ప్రేమ్‌దాస్, భీమ్ పటేల్, కిషన్, గంగాధర్, మక్కాజి, రాందాస్, సాయినాథ్, శంకర్, నాగేష్, సాయిలు, లస్మన్న, పుండలిక్, మోహన్, దేవన్న, లింగన్న, పెంటన్నలతో పాటు గ్రామ పెద్దలు, భజన భక్తులు పాల్గొన్నారు.

9వ తేదీ వరకు ధరణి స్పెషల్ డ్రైవ్



శెట్‌పల్లిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

పెంబి, మార్చి 1 : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9 వరకు ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపడుతుందని తహసీల్దార్ లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం పెంబి మండలంలో తహసీల్దార్ లక్ష్మణ్, డీటీ లచ్చన్న ఆధ్వర్యంలో రెండు టీంలు ఏర్పాటు చేసి మండల కేంద్రంతో పాటు పస్పుల, శెట్‌పల్లి, తదితర గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పెండింగ్ సమస్యలన్నింటినీ స్పెషల్ డ్రైవ్‌లో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రత్నాకర్‌రావు, ఆర్‌ఐ శ్రావణ్‌రెడ్డి, శత్రుగన్, రాజ్యం, పుండలిక్, అశోక్, శేఖర్, శ్రీను, స్వామి తదితరులు ఉన్నారు.

స్పెషల్ డ్రైవ్ చేపట్టిన అధికారులు

నర్సాపూర్(జి), మార్చి 1 : ధరణి సమస్యలకు ఎట్టకేలకు మోక్షం వచ్చింది. ప్రభుత్వం ఆదేశాలతో మండలంలో ధరణి సమస్యలపై స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టారు. ఈనెల 9లోపు ప్రధాన సమస్యలన్నీ పరిష్కరించడంతో పాటు కానివాటిని నేరుగా దరఖాస్తుదారుడికి సమాచారం ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నామని తహసీల్దార్ సోమ శ్రీనివాస్ తెలిపారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐ ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే..



బోరిగాంలో స్పెషల్ డ్రైవ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

ముథోల్, మార్చి 1 : ధరణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేసేందుకే తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ చేపట్టిందని ముథోల్ తహసీల్దార్ విఠల్ పేర్కొన్నారు. నేటి (మార్చి 1వతేదీ) నుంచి ఈ నెల 9వ తేదీ వరకు ఈ డ్రైవ్ కొనసాగనుందన్నారు. శుక్రవారం మండలంలోని బోరిగాం, ఆష్ట, రాంటెక్ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్లియర్ చేసేందుకే క్షేత్రస్థాయిలో వెళ్లి విచారణ చేపట్టినట్లు తెలిపారు. మొత్తం మూడు టీంలుగా ఏర్పడి 9వ తేదీ వరకు ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామారావు, ఆర్‌ఐనారాయణ తదితరులున్నారు.

గొడిసెరలో వైద్య శిబిరం

కుభీర్ మార్చి 1 : మండలంలోని గొడిసెర గ్రామంలోని పాఠశాలలో శుక్రవారం భైంసా వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి సూపరిండెంట్ వైద్యులు కాశీనాథ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు ఆయన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మాత్రలను అందజేశారు. గ్రామంలో చర్మవ్యాధులు ప్రబలిన కారణంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని, వ్యక్తిగత పరిశుభ్రత, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విజయానంద్, ముత్యంరెడ్డి, నాగేష్, చంద్రశేఖర్, కుమార్ యాదవ్, పాఠశాల హెచ్‌ఎం శంకర్, చైర్మన్ భోజారామ్, ఉపాధ్యాయులు, పిల్లల, తల్లిదండ్రులున్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ



పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

తానూర్, మార్చి 1 : మండలంలోని బోల్సా గ్రామంలో శుక్రవారం రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ చంద్రకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలను మరింత అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ గోపీనాథ్, నాయకులు చంద్రకాంత్, పోతన్న, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కుంటాల : కుంటాల మండలంలోని దౌనెల్లి గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయమని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే అన్నింటా ముందుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఫైమద్, ఎంపీటీసీ సుధాకర్, కోఆప్షన్ సభ్యులు గౌస్, ప్రత్యేకాధికారి ప్రకాష్‌తో పాటు గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



కుంటాల, మార్చి, 1: మండలంలోని అందకూర్ గ్రామంలో శుక్రవారం విద్యుత్ షాక్ తగిలి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన జితేందర్ రావు అనే రైతుకు చెందిన గేదె పశుగ్రాసం కొరకు గ్రామ శివారులోకి తరలించగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ. లక్ష వరకు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నారు.

మళ్లీ తెరపైకి డి- 1 పట్టాల వివాదం

● బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదుతో కలకలం ● ఆ భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్
● శ్రీకృష్ణ మందిర్ ఆలయ భూముల పరిరక్షణ కోసం ఆందోళన ● డి మార్ట్ కొనుగోలు చేసిన భూమి ప్రభుత్వానిదేనని ఫిర్యాదు

నిర్మల్ అర్బన్, మార్చి 1 : జిల్లాలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ముంపు బాధితులకు పునరావాసం కింద మంజూరు చేసే డి- 1 పట్టాల వివాదం తీవ్రమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో భారీ అవినీతి అక్రమాలకు పాల్పడి అక్రమ పట్టాలు చేశారన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తాజాగా ఈ భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం దుమారం రేపుతున్నది. జిల్లాలో సుమారు 3,500 వేలకు పైగా ఎకరాల ప్రభుత్వ భూములను ఎస్సారెస్పీ ముంపు బాధితులకు డి- 1 పాట్టల కింద పంపిణీ చేశారు. ఈ భూముల పంపిణీ వెనక భారీగా అక్రమాలు జరిగాయని కొన్నేళ్లుగా ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. గత ప్రభుత్వం హయాంలో డి- 1 పట్టాల పంపిణీ వ్యవహారం భారీగా అక్రమాలకు దారి తీసిందన్న ఆరోపణలున్నాయి. గత ఎన్నికల సమయంలో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పెద్ద ఎత్తున ఆరోపణలు చేశారు. తాజాగా ఇందుకు సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని ఆయన శుక్రవారం ప్రెస్‌మీట్ పెట్టి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పత్రాలను చూపారు. సుమారు 350 దాకా కొత్త పట్టాలు ఇచ్చారని ఇందులో భారీ మొత్తంలో అక్రమాలు జరిగాయని మహేశ్వర్‌రెడ్డి ఆరోపణ. 700ల ఎకరాలకు మించి అర్హులైన బాధితులు లేరని, మిగతా భూములన్నీ అక్రమంగా పట్టాలు చేసుకున్నవేనని ఆయన ఆరోపిస్తున్నారు. దీనిపై తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా కలెక్టర్ సైతం విస్తుపోయారని ఆయన పేర్కొన్నారు. సమగ్ర విచారణ జరిపే దాకా పోరాటం చేసి ఆ భూములను పేదలకు పంచుతామని ఆయన ప్రకటించారు.

శ్రీకృష్ణ ఆలయ భూములు అన్యాక్రాంతం

నిర్మల్ జిల్లా కేంద్రంలోని గాజులపేట్ ప్రాంతంలో శ్రీకృష్ణ ఆలయానికి చెందిన 9 ఎకరాల భూమి ఓ వర్గం చేతిలో అన్యాక్రాంతం అయ్యిందని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై కూడా ఆయన ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లోగా ఆ భూమిని స్వాధీనం చేసుకోని పక్షంలో భజరంగ్‌దళ్, భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో తామే స్వాధీనం చేసుకొని శ్రీకృష్ణ ఆలయానికి అప్పగిస్తామని ప్రకటించారు. అలాగే సోఫీనగర్ ప్రాంతంలో డి మార్ట్ వాణిజ్య సంస్థ కొనుగోలు చేసిన భూమి సైతం ప్రభుత్వ భూమి అని దీన్ని పట్టాలు సృష్టించి మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అనుచరులు అమ్ముకున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో కూడా సమగ్ర విచారణ జరపాలని మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం డిమాండ్ చేశారు. దివ్య నగర్‌లో ఉన్న అసైన్డ్ భూములను మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోద రుడు మురళీధర్‌రెడ్డి ఆయన ముఖ్య అనుచరుడు రామకృష్ణారెడ్డి సహా మరికొంత మంది ఆక్రమణలకు పాల్పడ్డారని ప్రభుత్వ భూములను దొంగ పట్టాలు సృష్టించి అనుభవిస్తున్నారని ఆరోపించారు. అలాగే వెంక టాపూర్ సమీపంలో ప్రభుత్వ భూమిలో బీఆర్ఎస్ నేత ప్లాట్లు పెట్టి అమ్మేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రజలు ఎవరూ కూడా ఈ ప్లాట్లు కొనవద్దని త్వరలోనే ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న తర్వాత పేదలకు పంచుతామని తెలిపారు. మహే శ్వర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు వ్యవహారం రాజ కీయంగా దుమారం రేపుతున్నది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, ముత్యంరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రామ్ శంకర్‌రెడ్డి, రంగారెడ్డి, సాగర్, సరికెల గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, రాబోయే అసెంబ్లీ సమావేశాలలో జర్నలిస్టుల సమస్యలపై బీజే పీ తరపున పోరాటం చేస్తామని బీజేఎల్పీ నేత నిర్మల్ నియో జకవర్గ శాసనసభ సభ్యులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరి రవీందర్, వెంకగారి భూమయ్య ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బీజేఎల్పీ నేతగా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడు తూ... జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి

మామడ : పాఠశాల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని బీజేఎల్పీ నేత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మామడ మండలంలోని పరిమండల్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి 13 లక్షల 50 వేలతో శంకుస్థాపన చేశారు. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ... పాఠశాలలో ఉన్న సమస్యలను తెలుసుకొని వచ్చే విద్యాసంవత్సరం నాటికి పూర్తి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 7, 8 తరగతి విద్యార్థులకు కూర్చునేందుకు ఇబ్బందిగా ఉందని తెలుసుకొని త్వరలో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి బెంచీలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి ఆలస్యం అయినట్లయితే తన సొంత నిధులతో విద్యార్థులకు బెంచీలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులు ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు కోండ్ర రాజారెడ్డి, డి. ముత్యంరెడ్డి, రాంశంకర్‌రెడ్డి, ధర్మయ్య, సురేష్, సంతోష్ ఎంపీడీవో, సుశీలక్ష ఎంఈవో, ముత్యం, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ పట్టణ అభివృద్ధికై అంతా కలిసికట్టుగా శ్రమిద్దాం

● మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ

ఖానాపూర్, మార్చి 1 : ఖానాపూర్ పట్టణ అభివృద్ధికై అంతా కలిసికట్టుగా శ్రమిద్దామని మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం అలియాస్ చిన్నం సత్యనారాయణ అన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యాక తొలిసారిగా శుక్రవారం కార్యాలయానికి వచ్చిన ఆయన స్థానిక కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణంలో తక్షణమే చేపట్టాల్సిన పనులను గుర్తించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. మౌలిక వసతుల కల్పనలో ఎటువంటి ఇక్కట్లు కలగకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ నెల 8వ తేదీన మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఉత్తరవాహిని గోదావరి నది తీరంలో ఏర్పాట్లు చేయాలని స్థానిక కౌన్సిలర్లు, పలువురు నాయకులు మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణకు వైస్‌చైర్మన్ సంతోష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గోదావరి నది తీరంలో అన్ని ఏర్పాట్లు చేస్తామని ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, కమిషనర్ మనోహర్ తెలిపారు. చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యాక తొలిసారి కార్యాలయానికి వచ్చిన చైర్మన్ చిన్నం సత్యనారాయణ, వైస్ చైర్మన్ కావలి సంతోష్‌లను స్థానిక మున్సిపల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కురుమ శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు బండారి కిషోర్, కాంగ్రెస్ నాయకులు జన్నారపు శంకర్, పరిమి సురేష్, అమానుల్లా ఖాన్, షబ్బీర్ పాషా, బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్, తదితరులున్నారు.

'రంజాన్ సందర్భంగా అన్నివార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి'

పవిత్ర రంజాన్‌మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పట్టణంలోని అన్నివార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మైనారిటీ నాయకులు అమానుల్లాఖాన్, షబ్బీర్ పాషాలు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చిన్నం సత్యనారాయణకు వైస్ చైర్మన్ కావలి సంతోష్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి కాలనీలో తాగునీటి సౌకర్యం, వీధిదీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య పనుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని వారు కోరారు. దీనిపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ రంజాన్ పవిత్ర మాసంలో ఎటువంటి ఇక్కట్లు తలెత్తకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో చర్యలు చేపడతామన్నారు. ఇదే మాసంలో మహా శివరాత్రి పర్వదినం సైతం ఉన్నందున పట్టణంలో వెంటనే పనులు ప్రారంభించి దగ్గరుండి పనులను పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌కు సూచించారు.



మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కావలి సంతోష్‌లను సన్మానిస్తున్న మున్సిపల్ సిబ్బంది

4న జిల్లాకు ప్రధానమంత్రి రాక

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన : ఎమ్మెల్యే పాయలశంకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయలశంకర్

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 1 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ జిల్లాలో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసేందుకు మార్చి 4న వస్తున్నారని ఎమ్మెల్యే పాయలశంకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న ఉదయం 10గంటలకు నరేంద్రమోదీ అధికారిక కార్యక్రమాలు, బహిరంగసభ ఉంటాయని పేర్కొన్నారు. ఆదిలాబాద్ బేల మహారాష్ట్ర వైపు వెళ్తున్న రహదారిని అభివృద్ధి పరిచేందుకు దాదాపు రూ.450 కోట్లతో నిధులు మంజూరుచేశారన్నారు.ఈ పనులకు భూమిపూజ చేస్తున్నారని, అలాగే పట్టణంలో మౌళిక సదుపాయాలు అండర్‌గ్రౌండ్ మురుగునీటి పారుదల,మంచినీటి వ్యవస్థ వంటి వాటికి అమృత్ పథకం కింద రూ.250 కోట్లను మంజూరు చేసి ఆ పనులకు కూడా శంఖుస్థాపన చేస్తున్నారని తెలిపారు. అనంతరం 10గంటలకు స్థానిక ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో భారీ బహిరంగ సభ ఉంటుందని, ఈ సభకు మంత్రులు, నాయకులు వస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్టును మంజూరి, ఆసియాలోనే అతిపెద్ద కాటన్ మార్కెట్ అయిన ఆదిలాబాద్‌కు టెక్స్‌టైల్ పార్కును ప్రకటించే అవకాశం ఉందన్నారు. గత ప్రభుత్వాల కారణంగా నాయకుల అలసత్వం వల్ల ఆదిలాబాద్‌కు రావాల్సిన టెక్స్‌టైల్ పార్కు వేరే జిల్లాలకు తరలిపోయిందని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు విషయమై ప్రస్తుత ముఖ్యమంత్రితో మాట్లాడడం జరిగిందని ఆయన సాను కూలంగా స్పందించారన్నారు. పలు సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులకు మంజూరు కూడా లభించే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు అంకత్‌రమేఉష్, ఆదినాథ్, లాలామున్న, చిల్కూరి జ్యోతిరెడ్డి, ఆకుల ప్రవీణ్, జోగురవి, మహస్త్రందర్, రఘుపతి, కృష్ణయాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో కాంగ్రెస్‌ను చీల్చే కుట్ర జరుగుతుంది

అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన, మార్చి 1 : కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని చీల్చే కుట్ర మరో మారు జరుగుతున్నదని, కాంగ్రెస్ శ్రేణులందరు అప్రమత్తతతో దాన్ని తిప్పికొట్టాలని అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం క్యాంపు కార్యాలయ ప్రజా సేవాభవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి నియోజక వర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తాను లేని సమయంలో కొంత మందిని వెనుకేసుకుని నాయకుడిలా చెలామణి అయ్యేందుకు చేస్తున్న కుట్ర పై ఆయన మండిపడ్డారు. వెనుకుండి వెన్నుపోటు పొడిచే నాయకులు పార్టీలో కొందరున్నారని, పరోక్షంగా అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సదరు నాయకుల వెనుక ఎవరున్నారో ప్రజలకు అర్థమైందన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీకి అన్యాయం చేయాలని చూస్తే కార్యకర్తలు సహించరన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కలిసి కట్టుగా పని చేసి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఎవరైనా అతని గెలుపుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ జెండా ఎగురేయడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు.ఇందులో సీనియన్ నాయకులు, జిల్లా కేంద్ర నాయకులు తదితరులున్నారు.

శనగ కొనుగోళ్లకు ఏర్పాట్ల పై సమీక్ష

ఆదిలాబాద్ అర్బన్, మార్చి1: ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో శనగ కొనుగోలుకు సన్నాహక ఏర్పాటులు చేసేందుకు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, జిల్లా కొనుగోలు కమిటీ అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ/ కమిటీ చైర్మన్ అధ్యక్షతనసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 9 శనగ కొనుగోలు కేంద్రాలను గుర్తించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదిలాబాద్, జైనథ్, తాంసి, బేల, ఇచ్చోడ, బోథ్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్ లలో కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. తదుపరి కమిటీ సన్నాహక ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా మేనేజర్ మార్క్‌ఫెడ్‌కు ఆదేశాలను జారా చేసిందని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా రైతులు గమనించి తమ శనగ పంటను బయట మార్కెట్‌లో ప్రభుత్వ మద్దతు రూ. 5440క్వింటాల్ కంటే తక్కువ ధరకు అమ్మి నష్టపోకుండా తమ సరుకును శుభ్రపరిచి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. త్వరలోనే శనగల కొనుగోలు ప్రారంభ తేదీలను వెల్లడించనట్లు తెలిపారు.

ఆదివాసీ గూడెంలో పల్లెనిద్ర హామీ నేరవేర్చిన జడ్పీ చైర్మన్ జనార్ధన్

ఉట్నూర్, మార్చి1: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లెనిద్ర కార్యక్రమంలో గిరిజనులకు ఇచ్చిన హామీని శుద్ధ జలపథకాన్ని ఏర్పాటు చేసిజిల్లా పరిషత్ చైర్మన్ నేరవేర్చారు. ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ మండలంలోని కన్నాపూర్‌లో శుద్ధజలప్లాంటును ఏర్పాటు చేసి ఆది వాసులకు శుద్ధ జలం అందించడానికి పూనుకున్నారు. ఉట్నూర్ మండలం కన్నాపూర్‌లో గత సంవత్సరం నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా కన్నాపూర్‌లో నెలకొన్న సమస్యలను పూర్తిగా క్షుణంగా పరిశీలించి అక్కడ ఫ్లోరైడ్ నీరు వస్తుందని గిరిజనులు చెప్పడంతో శుద్ధజలప్లాంటు, కొత్త బోరు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీలో నోడల్ ఆఫీసర్‌ల పాలన

● ప్రధాన విభాగాలకు అధికారుల నియామకం ● పరిపాలన సౌలభ్యం కోసం వికేంద్రీకరణ ● వైస్ ఛాన్సలర్ వెంకటరమణ



మీడియాతో మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ వెంకటరమణ

బాసర, మార్చి 1 : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో నోడల్ ఆఫీసర్‌ల పాలనకు శ్రీకారం చుట్టారు. దీంతో పాటు యూనివర్సిటీలో జరిగే వివిధ కార్యక్రమాలు అంశాలపై వైస్‌ఛాన్సలర్ శుక్రవారం సాయంత్రం మీడియాకు వెల్లడించారు. పరిపాలన సౌలభ్యం కోసం అధికారాలను వికేంద్రీకరించినట్లు వివరించారు. హాస్టల్, వైద్య సేవలు, భోజన శాలలు, సెక్యూరిటీ, మౌలిక వసతులు, అకాడమిక్, పరీక్షలు ఇలా ప్రతీ విభాగానికి ప్రత్యేక అధికారులను నియమించినట్లు చెప్పారు. కింది స్థాయిలో వీరు రూపొందించే యాక్షన్ ప్లాన్ ప్రకారమే కొనసాగుతుందని, కీలకమైన నిర్ణయాలు, మార్పులు, చేర్పులు వంటివి మాత్రమే అన్ని విభాగాల సమన్వయంతో జరుగుతుందని అన్నారు. యూనివర్సిటీలో దురదృష్టవశాత్తు చిన్నచిన్న ఘటనలు చోటుచేసుకుంటున్నప్పటికీ ఇకముందు ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా యూనివర్సిటీపై ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. త్వరలోనే ఖాళీగా ఉన్న డైరెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ జరుగుతుందని అప్పటి వరకు ఈ నోడల్ అధికారులే పరిపాలన బాధ్యతలు చూసుకుంటారని చెప్పారు.

రూ. 103 కోట్లతో ట్రిపుల్ ఐటీ బడ్జెట్

ట్రిపుల్ ఐటీ అవసరాల కోసం రూ.103 కోట్లతో బడ్జెట్ రూపొందించినట్లు వైస్ ఛాన్సలర్ వెంకటరమణ తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించినట్లు పేర్కొన్నారు. ఇందులో రూ.38 కోట్ల 70 లక్షల నిధుల కేటాయింపు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో యూనివర్సిటీకి కేటాయించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో 80 శాతం నిధులు వేతనాలకే సరిపోతాయని అన్నారు. పూర్తి స్థాయిలో నిధులు వస్తే ఎగ్జామినేషన్, సైన్స్, ల్యాబ్ వంటి పెండింగ్‌లో ఉన్న భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

యూనివర్సిటీ ప్లాంటేషన్‌లకు అవార్డులు

యూనివర్సిటీలో ఉన్న ప్లాంటేషన్‌కు ఇప్పటికే ఒక అవార్డు రాగా రాష్ట్ర స్థాయిలో మరో అవార్డు లభించిందని వైస్ చాన్సలర్ తెలిపారు. 2022-23 సంవత్సరానికి ఎడ్యుకేషన్ కెటగిరిలో మెగా ప్లాంటేషన్ అవార్డు దక్కిందని పేర్కొన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైన యూనివర్సిటీలో ప్లాంటేషన్‌ను కాపాడుకుంటామని పేర్కొన్నారు.

ఇద్దరు విద్యార్థుల సస్పెన్షన్

గంజాయి ఘటనలో ఇద్దరు విద్యార్థులను సస్పెండ్ చేసినట్లు వైస్ ఛాన్సలర్ తెలిపారు. క్రమశిక్షణ కమిటీ నివేదిక ప్రకారం ఒక సెమిస్టర్ కాలం పాటు సస్పెన్షన్ విధించినట్లు వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా సెక్యూరిటీ అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు.

గృహజ్యోతి పథకంలో జీరో బిల్ రానివారు ఆందోళన చెందొద్దు

● తెల్లరేషన్ కార్డుతో మున్సిపల్ తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు ● టీఎస్ ఎన్‌పీడీసీఎల్ డీఈ నాగరాజు

ఖానాపూర్, మార్చి 1 : తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకంలో జీరోబిల్లు రానివారు ఆందోళన చెందవద్దని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ డీఈ నాగరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జేకేఫంక్షన్‌లో నాలుగు మండలాల ఏఈలకు విద్యుత్‌శాఖ సిబ్బందికి ఆయన గృహజ్యోతి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గృహజ్యోతి వీధి విధానాలను తెలియజేశారు. మార్చి నెల నుండి 200ల యూనిట్లు వినియోగించే తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి జీరో బిల్లు వర్తిస్తుందన్నారు. అంతకు మించి విద్యుత్ వినియోగిస్తే పూర్తి బిల్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసేవారిమని ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారికి కూడా 200ల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. జీరో బిల్లు రానివారు ఆందోళన చెందకుండా తమ తెల్లరేషన్ కార్డుతో మున్సిపల్ పరిధిలోని వారైతే మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని గ్రామ పంచాయతీ పరిధిలోని వారైతే తహసీల్దార్ కార్యాలయంలో గృహజ్యోతి కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన రసీదును తెచ్చి విద్యుత్‌శాఖ కార్యాలయంలో అందజేస్తే మార్చి నెల నుండి జీరోబిల్లు వర్తిస్తుందన్నారు. బిల్లుకొట్టే సమయంలో 30 దాటినప్పటికీ 30 రోజుల్లో వినియోగించిన విద్యుత్ యూనిట్లను మాత్రమే పరిగణలోకి తీసుకొని సదరు మీటరుకు జీరో బిల్లు నిబంధనలను వర్తింపజేస్తారన్నారు. అద్దె ఇంట్లో ఉంటున్న వారు తాము చెల్లించే కరెంట్ బిల్లు తాలూకు మీటర్‌కు తెల్లరేషన్ కార్డులు జత చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఎన్‌పీడీసీఎల్ ఖానాపూర్ ఏడీఈ శ్రీనివాస్, ఖానాపూర్ ఏఈ తిరుపతి, కడెం ఏఈ సుమన్, పెంబి ఏఈ శ్రీనివాస్, మామడ ఏఈ బాలయ్య, సబ్ ఇంజనీర్ వెంకటేష్‌లతో నాలుగు మండలాల సిబ్బంది పాల్గొన్నారు.




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న నాగరాజు

మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన

ఖానాపూర్, మార్చి 1 : మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యవైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు వివిధ అంశాల్లో చేసిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. గ్రహాల గమనం కోతులతో పాటు వన్యప్రాణుల వల్ల పంట పొలాలకు నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోదసిలోకి రాకెట్ దూసుకెళ్లే విధానం, జంతువుల ఊపిరితిత్తుల పనితీరు తదితర అంశాలపై విద్యార్థులు తయారు చేసిన 50 రకాల వర్కింగ్ మోడల్స్ ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఇర్రి నరేందర్ రెడ్డి, బోనగిరి నరేందర్, తొంటి శంకర్, కుర్ర శేఖర్, జాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలి : జేఏసీ

నిర్మల్ కల్చరల్, మార్చి 1 : విద్యాశాఖలో రాష్ట్రవ్యాప్తంగా ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్న సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. శుక్రవారం వాసవి స్కూల్‌లో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బి. గంగాధర్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యార్హతలుండి చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరీక్ష ద్వారా ఎంపికైన తమకు న్యాయం చేయడం లేదన్నారు. కొత్త ప్రభుత్వహయాంలో తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావంతో ఉన్నట్లు తెలిపారు. గజేందర్, భోజన్న పాల్గొన్నారు.



ప్రధాని పర్యటన..
ప్రతిష్ఠాత్మకం

- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డికి జన సమీకరణ బాధ్యతలు
- నిర్మల్, ముథోల్ నియోజకవర్గాలకు భారీ టార్గెట్
- మోడీ ముందుకు అటవీ అనుమతులు, రైల్వేలైన్, ఇతర సమస్యలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన బీజేపీ శ్రేణులు

నిర్మల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి)

ప్రధాని నరేంద్రమోడీ ఈ నెల 4వ తేదీన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరపబోతున్న పర్యటన బీజేపీ జిల్లా శ్రేణులకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. నిర్మల్‌తో పాటు ముథోల్ నియోజకవర్గాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు గెలుపొందిన కారణంగా పార్టీ కార్యక్రమాలకు ఈ రెండు నియోజకవర్గాలు కీలకం కానున్నాయి. ఇందులో భాగంగానే ప్రధాని నరేంద్రమోడీ సభకు భారీ ఎత్తున నిర్మల్‌తో పాటు ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల నుంచి భారీగా జనాన్ని ఆదిలాబాద్‌లో నిర్వహించే మోడీ బహిరంగ సభకు తరలించే దిశగా చర్యలు చేపట్టారు. బీజేఎల్పీ నేతగా ఎన్నికైన మహేశ్వర్ రెడ్డిపై జన సమీకరణతో పాటు బహిరంగ సభ, ఇతర కార్యక్రమాల ఏర్పాట్ల బాధ్యతలను అధిష్ఠానం అప్పగించింది. కొద్ది రోజుల్లోనే పార్లమెంట్ ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోడీ జరపబోతున్న పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ముఖ్యంగా ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు గెలుపొందడంతో.. ఈ నియోజకవర్గాల ఓట్లే పార్లమెంట్ ఎన్నికల్లో కీలకంకానున్నాయి. నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో ఈ సారి బీజేపీ తమ లోక్‌సభ అభ్యర్థికి దాదాపు రెండు నుంచి రెండున్నర లక్షల మెజార్టీని సాధించాలని భావిస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో నిర్మ ల్ నియోజకవర్గానికి బీజేపీ 50వేల ఓట్ల మెజార్టీని సాధించిన సంగతి తెలిసిందే. ముథోల్ నియోజకవర్గంలో సైతం 25వేలకు పైగా ఓట్ల మెజార్టీని ఆ పార్టీ కూడగట్టింది. అయితే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఈ రెండు నియోజకవర్గాలతో పాటు ఖానాపూర్ నియోజకవర్గం నుంచి కూడా భారీగా ఓట్లను సాధించేందుకు బీజేపీ ఎత్తుగడలు రూపొందిస్తోంది. ఇదిలా ఉండగా.. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన కారణంగా చాలా నియోజకవర్గాల్లో సమీకరణలు తలకిందులయ్యాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ ఒక్కసారిగా చతికిలపడిపోవడమే కాకుండా ఆ పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలంతా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతుండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ పరిణామాలు బీఆర్ఎస్‌ను కోలుకోకుండా చేయనుండగా.. బీజేపీని అప్రమత్తం చేస్తున్నాయి. జనం నాడి కాంగ్రెస్ పార్టీ వైపు మరలకుండా బీజేపీ పకడ్బందీ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో ప్రధాని నరేంద్రమోడీ పర్యటనను చేపట్టే దిశగా చేసిన ప్రయత్నాలు ఫలించాయి. లోక్‌సభ నియోజకవర్గ కేంద్రమైన ఆదిలాబాద్‌లో ప్రధాని నరేంద్రమోడీ బహిరంగ సభను నిర్వహించనున్న కారణంగా అన్ని నియోజకవర్గాల్లో హడావుడి మొదలైంది. మోడీ సభకు జనాన్ని పెద్ద సంఖ్యలో తరలించి తమ సత్తాను చాటుకోవాలని అలాగే టికెట్‌ను ఆశిస్తున్న నేతలు సైతం పోటాపోటీగా జన సమీకరణపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

మహేశ్వర్ రెడ్డిపై కీలక బాధ్యతలు

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ దిగ్గజం, అప్పటి మంత్రి అయిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని 50వేల ఓట్ల మెజార్టీతో ఓడించి తన సత్తా చాటుకున్న ఏలేటీ మహేశ్వర్‌రెడ్డికి జిల్లాలో ప్రధాని నరేంద్ర మోడీ మొదటిసారి జరపబోతున్న పర్యటన ప్రతిష్ఠాత్మకం కానుంది. పార్టీ అధిష్ఠానం మహేశ్వర్ రెడ్డికి బీజేపీ శాసనసభ పక్ష నేత పదవిని కట్టబెట్టి ప్రాధాన్యతను కల్పించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బీజేపీ అధిష్ఠానం ప్రధాని నరేంద్రమోడీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై మహేశ్వర్‌రెడ్డికే ప్రధాన బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. దీనికి అనుగుణంగానే మహేశ్వర్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రను ముగించుకొని శుక్రవారం నిర్మల్‌కు చేరుకున్నారు. ఉదయం నుంచి ఆయన నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల పార్టీ నేతలు, ఎమ్మెల్యేతో సంప్రదింపులు జరిపి జన సమీకరణకు సంబంధించి సమీక్ష జరిపారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

చేరికలు.. సమస్యలపై నజర్

ప్రధాని నరేంద్రమోడీ రాక సందర్భంగా నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాలకు సంబంధించి అసంతృప్తితో ఉన్న పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను బీజేపీలోకి రప్పించేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ప్రధాని మోడీ సభ సందర్భంగా వారందరినీ బీజేపీలోకి ఆహ్వానించే దిశగా కార్యాచరణ కొనసాగిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్న సమయంతో ఆ పార్టీ నేతలు ప్రధాని మోడీ సభను అనుకూలంగా మలుచుకోవాలని భావిస్తున్నారు. దీంతో పాటు జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సర్కారు సహాయంతో ముడిపడి ఉన్న పలు సమస్యలను సైతం ప్రధాని మోడీ దృష్టికి తీసుకుపోవాలని బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. జిల్లాలో కేంద్ర అటవీ శాఖ అనుమతులు లేక నిలిచిపోయిన బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణ పనులకు అనుమతులకు సంబంధించిన అంశంతో పాటు ఆర్మూర్ - నిర్మల్ రైల్వేలైన్ సమస్యను కూడా మహేశ్వర్‌రెడ్డి ప్రధాని దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు సమాచారం. వీటితో పా టు కేంద్ర ప్రభుత్వ సహాయం అవసరం ఉన్న పథకాల విషయంలో కూడా బీజేఎల్పీ నేతగా మహేశ్వర్ రెడ్డి ప్రధానితో చర్చించనున్నట్లు సమాచారం.

లోక్‌సభ ఎన్నికలే టార్గెట్‌గా..

ఇదిలా ఉండగా.. బీజేపీ అధిష్ఠానం రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గెలుపు కోసం వ్యూహాత్మకంగా ప్రధాని నరేంద్రమోడీ పర్యటనను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చేపట్టబోతుంది. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైనా గెలుపు సాధించాలన్న లక్ష్యంతోనే ప్రధాని నరేంద్రమోడీ పర్యటనను సక్సెస్ చేసి ఈ పర్యటన ప్రభావాన్ని రాబోయే లోక్‌సభ ఎన్నికలపై ఉండేట్లు చూస్తోంది. దీనికి అనుగుణంగానే ప్రధాని నరేంద్రమోడీ సభకు భారీగా జన సమీకరణను చేపట్టి తమ సత్తాను చాటుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. కొద్ది రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి సభను నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ తన ఇమేజ్‌ను పెంచుకునే ప్రయత్నం చేసింది. కాంగ్రెస్ పార్టీ కూ డా రాబోయే లోక్‌సభ ఎన్నికలనే లక్ష్యంగా పెట్టుకొని రేవంత్ రెడ్డి చేత సభ నిర్వహింపజేసిన సంగతి తెలిసిందే. ఈ సభకు దీటుగా మోడీ సభ ను నిర్వహించి తన బలాన్ని నిరూపించుకునేందు కోసం బీజేపీ శ్రేణులు క్షేత్ర స్థాయిలో పావులు కదుపుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

ప్రధాని బహిరంగ సభను
విజయవంతం చేయాలి

- ముథోల్ నియోజకవర్గంలో సన్నాహక సమావేశాలు
- భైంసాలో పాల్గొన్న ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, మార్చి 1 : ఈ నెల 4న ఉమ్మడి జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్‌లో ప్రధాని మోడీ పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ శ్రేణులకు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ముథోల్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండల కేంద్రాల్లో బహిరంగ సభ సన్నాహక సమావేశాలు జరగగా.. భైంసాలో జరిగిన సమావేశంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జరగనున్న ప్రధాని మోడీ పర్యటనను పార్టీ శ్రేణులన్నీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచి ంచారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతీ బూత్ నుంచి ప్రజలు, పార్టీ శ్రేణులు ప్రధాని మోడీ బహిరంగ సభకు తరలించేందుకు బీజేపీ ప్రతినిధులు బాధ్యతాయుత చర్యలు చేపట్టాలన్నారు. మండల బాధ్యులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు గ్రామ, బూత్ కమిటీలను సమన్వయం చేసుకొని జన సమీకరణ చేపట్టాలని పేర్కొన్నారు. ఇదే క్రమంలో పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం బీజేపీ శ్రేణులన్నీ పకడ్బందీ విధానాలతో సన్నద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ ముథోల్ నియోజక వర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, భైంసా ఎంపీపీ అబ్దుల్ రజాక్‌తో పాటు భైంసా పట్టణ, మండల పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత

నర్సాపూర్(జి), మార్చి 1 : మండలంలోని గొల్లమాడ గ్రామంలో గురువారం రైతువేదికలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ 41 చెక్కులను ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం సీసీ, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ, ప్రభుత్వ పాటశాలలో డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సోమ శ్రీనివాస్, గిర్దావర్ సుమలత, వేణుగోపాల్, వైస్ యంపీపీ మ్యాదరి లక్ష్మీసుధాకర్, తాజా మాజీ సర్పంచ్ చెన్న మహేశ్, బాశెట్టి విజయ్, ఛత్రపతి, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'విజయ సంకల్ప యాత్రకు అనూహ్య స్పందన'

నిర్మల్ కల్చరల్, మార్చి 1 : రాష్ట్రంలో ఫిబ్రవరి 20వ తేదీ నుంచి పది రోజుల పాటు బీజేపీ నిర్వహించిన విజయ సంక ల్ప యాత్రకు అనూహ్య స్పందన లభించిందని, ప్రజలు బ్రహ్మరథం పట్టారని కొమురం భీమ్ క్లస్టర్ ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. శుక్రవారం నిర్మల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ సభలకు మహిళలు, యువ కులు పెద్ద సంఖ్యలో హాజరుకావడం ప్రధాని మోడీ పాలనపై ఉన్న విశ్వాసం రుజువైందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 17 స్థానాల్లో గెలుపు సాధి స్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని బలపర్చాలని కోరారు. నాయకులు సామ రాజేశ్వర్ రెడ్డి, సాగర్, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అర్హులకు విశ్వకర్మ పథకం అందేలా చూడండి : కలెక్టర్



విశ్వకర్మ పథకంపై వివరిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మార్చి 1 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ పథకం అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పథకం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ పథకంపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. 18 రకాల చేతివృత్తుల వారికి మొదటి విడత 5 శాతం వడ్డీపై లక్షల రూపాయల రుణ సౌకర్యం అందిస్తారన్నారు. 18 నెలల్లో ఈ మొత్తం చెల్లించిన వారికి రెండు లక్షలు రుణం అందిస్తుందన్నారు. 30 నెలల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. మీసేవ కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన లబ్ధిదారులకు నైపుణ్య కేంద్రాల్లో వారం రోజుల శిక్షణ ఉంటుందని, రోజుకు 500 చెల్లిస్తారన్నారు. ఇప్పటివరకు నమోదైన దరఖాస్తుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పరిశ్రమల శాఖ మేనేజర్ నర్సింహారెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలకు ఇంకా దరఖాస్తు చేసుకోవచ్చు

ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేయని వారు ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సీఎస్ శాంతి కుమారి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ తరువాత ఆమె చేసిన సూచనలు ఆదేశాలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు కోసం అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించాలన్నారు. కేంద్రాలపై విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ఇంటర్, టెన్త్ పరీక్షలను పొరపాట్లు జరుగకుండా తనిఖీలు చేపట్టి నిర్వహించాలన్నారు. ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి : ఎస్పీ

- జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల

దిలావర్‌పూర్, మార్చి 1 : ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల అన్నారు. శుక్రవారం సాయంత్రం దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని సిబ్బందికి సూచించారు. మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుపై గ్రామస్థులకు విస్తృతంగా అగాహన కల్పించారు. ఆర్థిక, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం రిసెప్షన్, మెన్‌బ్యారక్, టెక్నికల్ రూమ్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీసుసిబ్బంది విధులతో పాటు వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దిలావర్‌పూర్ ఎస్సై సుమాంజలి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల

డి - 27 కెనాల్‌కు వెంటనే నీటిని విడుదల చేయాలి



ఖానాపూర్, మామడ మండలాల మధ్య గల డి - 27 కెనాల్‌ను పరిశీలిస్తున్న రైతు సంఘాల నాయకులు

ఖానాపూర్, మార్చి 1 : సరస్వతీ కాలువ ఉప కెనాల్ అయిన డి - 27 కెనాల్‌కు వెంటనే నీటిని విడుదల చేయాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులతో కలిసి డి - 27 కెనాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డి - 27 కెనాల్‌కు నీటి విడుదల చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తుండడంతో వేలాది ఎకరాల్లో పంట ఎండిపోతుందన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఎక్బాల్‌పూర్, తర్లపాడ్, సత్తెనపల్లి, పాత ఎల్లాపూర్ నర్సాపూర్, పెత్తర్పు, మాసాయిపేట్ గ్రామాలకు సంబంధించిన రైతులు తీవ్రఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారుల తప్పిదాలతో రైతుల మధ్య వివాదాలు తలెత్తే పరిస్థితి నెలకొంటుందన్నారు. అధికారులే స్పందించి అన్ని గ్రామాల రైతులకు నీరు అందేలా చర్యలు చేట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఖానాపూర్ శివారులోని కొమరం చౌరస్తాలో రైతులతో కలిసి రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు పీటర్, గంగారాం, శ్రీనివాస్, బక్కన్న, చంద్రయ్య, ఎల్లయ్య, తదితరులున్నారు.

'గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి'

కుభీర్ మార్చి 1 : మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్స్ రైట్స్ కౌన్సిల్ కుభీర్ మండల చైర్మన్ సాప పండరి డిమాండ్ చేశారు. శుక్రవారం కుభీర్ గ్రామపంచాయతీలో పంచాయతీ కార్మికులతో కలిసి సమ్మెలో పాల్గొన్నారు. కరోనా వంటి కష్టకాలంలో తమ కుటుంబాలను వదిలి గ్రామ సేవకులుగా సేవలందించారని, వారికి గౌరవ వేతనాలను చెల్లించాలన్నారు. అదే విధంగా గత సంవత్సరం నుండి వారికి రావాల్సిన బట్టలు, సబ్బులు, కొబ్బరి నూనె సైతం రావడం లేదని వాటినికి కూడా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామసేవకులు మహేష్, పండరి, గంగారాం, నర్సయ్య, రుక్మాబాయి, నారాయణలున్నారు.

సంక్షిప్త సమాచారం

ఈ సేవ కేంద్రాలతో సత్వరసేవలు

నిర్మల్ కల్చరల్, మార్చి 1 : ప్రజలకు సత్వర సేవలందించడంలో ఈసేవ కేంద్రాలు కీలకపాత్ర వహిస్తున్నాయని అధ్యాపకుడు డాక్టర్ యూ. గంగాధర్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ గవర్నెన్స్ గుడ్ గవర్నెన్స్ సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభించారు. ఈ సమావేశానికి హాజరై మాట్లాడుతూ.. ప్రజాసమస్యలు పరిష్కారం, పారదర్శకత, పలు రంగాల్లో ప్రవేశాలకు దోహదపడుతున్నాయన్నారు. 100 రకాల సేవలు ఈసేవ కేంద్రాలు అందిస్తున్నామన్నారు. ఈ గవర్నెన్స్ ప్రజలు ఉపయోగించుకొని ప్రయోజనం పొందాలన్నారు. ప్రిన్సిపాల్ భీమ్‌రావు, పీజీరెడ్డి, ఆఫ్రీన్ సుల్తానా, డా.శంకర్, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన ట్రస్మా చైర్మన్

నిర్మల్ కల్చరల్, మార్చి 1 : నిర్మల్ పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన బి. అనిల్‌ను ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జి. శ్రీనివాస్‌గౌడ్, సోన్ జడ్పీటీసీ జీవన్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పోశెట్టి, అమరవేణి నర్సాగౌడ్ సీఐని కలిసిన వారిలో ఉన్నారు.

4న కొమురవెల్లిలో
మోకుదెబ్బ సమావేశం

నిర్మల్ కల్చరల్, మార్చి 1 : మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ సమావేశం ఈ నెల 4న కొమురవెల్లిలోని మల్లన్న ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, ప్రధాన కార్యదర్శి ఆర్. సిద్ధిరాములు గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. గీత కార్మికులు, గౌడ కుల సమస్యలపై చర్చించి 5న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లాల్లోని నాయకులు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కుంటాల, మార్చి, 1 : కుంటాల మండలంలోని రాజాపూర్ తాండాకు చెందిన చౌహాన్ ఓంకార్ (32) అనే యువకుడు అనారోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు కుంటాల ఎస్సై రజనీకాంత్ తెలిపారు. ఎస్ఐ, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ఓంకార్ గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడని ఎన్నిసార్లు వైద్య పరీక్షలు చేయించుకున్నా ఫలితం లేదు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన ఎంత సేపటికి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గ్రామసమీపంలో గాలించారు. గ్రామ సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉన్నాడని వెంటనే వైద్య పరీక్షల నిమిత్తం భైంసా ఆసుపత్రికి 108లో తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుని భార్య పాయల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.